# కాపాడినోళ్లనే కాపాడుకుంటం..

## కాంగ్రెస్ అంటే దళారుల రాజ్యం

### మంచిగైన ఎవుసం పాడైతది.. భూముల విలువ పడిపోతది

**కరెంటు లేకుంటే అరిగోస పడుతం.. మా బతుకులను మళ్లీ ఆగం చేసుకోం**

**కేసీఆరే కంటికి రెప్ప.. కడుపున వెట్టుకొని కాసుకుంటున్న బీఆర్ఎస్ వెంటే ఉంటం**

**స్పష్టం చేస్తున్న రైతులు, ప్రజలు**















*నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 29 : 'సావునోట్లె తల్కాయవెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆరే, తెలంగాణకు ఏంగావాల్నో ఆలోచించి పనులుజేత్తాండు. నాడు పడావువడ్డ ఎవుసాన్ని పచ్చగజేసిండు. కాంగ్రెస్ పాలనల సుక్కనీళ్లు లేక ఎంతేడ్శినం.. నీళ్లు లేక భూములు ఇడిశిపెట్టి ఎంత గోసపడ్డం.. నాడు భూములకు విలువుండెనా? అప్పలు కట్టలేక అడ్డికిపావుశేరు లెక్క అమ్ముకున్నం.. మళ్ల ఆ రోజులు రావద్దు' అంటున్నారు రైతులు. తమను కంటికి రెప్పలా కాపాడుతున్న కేసీఆర్ వెంటే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్‌ల ఒక్కో నాయకుడు ఒక్కో తీరుగ మాట్లాడుతున్నడని, ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదని చెబుతున్నరు. కేసీఆర్ ఎంతో కష్టపడి ఇంత మంచిగ చేసిన వ్యవసాయాన్ని మళ్లీ పాడుచేసుకోబోమని తేల్చి చెబుతున్నారు. ఇప్పడే రైతుల చేతిల్లో నాలుగు పైసలు కనవడుతున్నయని, భూముల ధరలు పెరిగి మొఖం తెలివైందని, రేవుకు వచ్చిన బతుకులను ఆగం చేసుకుంటమా అని అంటున్నరు. కాంగ్రెస్ పాలన అంటే చీకటి రోజులని, వాటిని మళ్లీ తాము కోరుకోవడం లేదని స్పష్టం చేస్తున్నారు. వాళ్లు అబద్ధాలు చెప్పి కర్ణాటకలో అధికారంలోకి వచ్చారని, అక్కడ అమలుకాని హామీలు ఇక్కడ ఎట్ల చేస్తరని ప్రశ్నిస్తున్నరు. రేవంత్‌రెడ్డి అంటున్నట్లు మూడు గంటల కరెంటుతోని ఎవుసం ఎట్లజెయ్యాల్నో ఆయనకే తెలువాలె అని ఎద్దేవా చేస్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి ఎవుసం చేస్తే భూముల నీళ్లు ఆగుతయా అని ప్రశ్నిస్తున్నారు. రెండు, మూడు ఎకరాలున్న రైతులకు 10హెచ్‌పీ మోటర్లు అవసరమా అని, అంత ఖర్చు ఎవరు పెడుతారని అడుగుతున్నారు. ఇప్పడున్న పరిస్థితికి 24గంటల కరెంటే మేలని, రైతులు తమకు ఎప్పడు అవసరం, వీలు ఉంటే అప్పడు పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నారని, ఇప్పడే ప్రశాంతంగ ఉన్నామని చెబుతున్నారు. ధరణితోని ఏ లొల్లి లేకుండ భూ సమస్యలు తీరుతున్నాయని, దాన్ని తీసేసి కౌలుదారు కాలమ్ పెడితే ఊళ్లలో మళ్లీ రోజూ కొట్లాటలే ఉంటాయని అంటున్నారు. పట్వారీలు, దళారీల రాజ్యం వస్తే రైతులు గోస పడుతారని, ఇప్పడున్న వ్యవస్థనే బాగుందని చెబుతున్నారు. రైతుల బాగోగులు కోరి పెట్టుబడి సాయం, సబ్సిడీ పనిముట్లు, 24గంటల కరెంటు, పుష్కలంగా సాగునీళ్లు ఇస్తున్న బీఆర్ఎస్ వెంటే తామంతా ఉంటామని కుండబద్దలు కొడుతున్నారు.*

### రైతుల మంచికోరే నాయకుడు కేసీఆర్



నర్సింహులపేట: 40 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నా. రైతులను ఆదుకున్న పార్టీలు లేవు. అప్పుల బాధతో ఇబ్బందులు పడినా అప్పట్లో కనీసం కన్నెత్తి చూడలేదు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత రైతుల బాగోగులు చూసే నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయిండు. మొదట్లో ఎకరానికి రూ.8వేలు, ఆ తర్వాత రూ.10 వేలు, ఇప్పుడు మళ్ల రూ.12వేలు ఇవ్వడంతో పాటు ఐదేళ్లలో రూ.16 వేలు ఇస్తామని చెప్పిండ్రు. మాట ఇస్తే తప్పకుంట చేస్తడు. మా నమ్మకం ఉంది. 24గంటల కరెంట్, వ్యవసాయానికి సాగునీరు తీసుకచ్చిండ్రు. ఇంత మంచిగా మాకు అండగా ఉండే నాయకుడికి రైతులందరూ రుణపడి ఉంటం. గతంలో పంటలు పండించాలంటే పెట్టుబడి కోసం వ్యాపారుల దగ్గరకు వెళ్లేవాళ్లం ఇప్పుడు అ తిప్పలు లేవు. నా బ్యాంకు ఖాతాలో పడుతున్నయి. రైతుబంధు పెంచుతమని సీఎం చెప్పడం కడుపు నిండినట్లుగ ఉన్నది. అందుకే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలె. వస్తది కూడ. కేసీఆర్‌కే మా మద్దతు.

**- పసుపులేటి వెంకన్న, రైతు, నర్సింహులపేట**

### కాంగ్రెసోళ్లవి మోసపూరిత హామీలు..



కురవి: కాంగ్రెస్ నాయకులు ఇచ్చే హామీలు మోసపూరితమైనవి. వాళ్లు ఇచ్చే 3గంటల కరెంట్ వ్యవసాయానికి ఎటూ సరిపోదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకునే స్థోమత రైతులకు లేదు. గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది. కరెంట్ లేక, సాగునీరు లేక చాలా ఇబ్బందులకు గురిచేసింది. కానీ కేసీఆర్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నది. 24గంటల కరెంట్ ఇచ్చి రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు అమలు చేస్తూ సీఎం కేసీఆర్ అన్నదాతలకు అండగా నిలిచారు. మళ్లీ కాంగ్రెసోళ్లను నమ్మితే పాతరోజులు, కష్టాలు, చీకట్లు మొదలవుతాయి. అందుకే కేసీఆర్ ప్రభుత్వంలోనే అందరూ సంతోషంగా ఉంటున్నరు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ వస్తది. ఎంతమంది చెప్పినా.. ఎన్ని కానుకలు ప్రకటించినా కష్టకాలంలో ఆదుకొని రైతుకు జీవం పోసిన కేసీఆర్ వెంటనే రైతు ఉంటడు. ఇది తప్పదు.

**- బానోత్ బావ్‌సింగ్, రైతు, బోడతండా**

### కేసీఆర్ ఉండగా రోజూ పండుగే..



కురవి : నా వయసులో ఎన్నో పార్టీలను చూసిన. అసలు మారుమూల గ్రామాల్లో రైతులు పడే కష్టాలు ఎవరికైనా తెలుసా? అసలు రైతును పట్టించుకున్నోడు ఉన్నడా? ఇప్పుడు అది చేస్తం.. ఇది చేస్తం అని మస్తు మాటలు చెబుతాన్రు. రాష్ట్రం బాగుండాలంటే ముందు రైతు సంతోషంగా ఉండాలని కోరుకునే సీఎం కేసీఆర్‌కు ఎవరూ సరిలేరు. గతంలో ఎన్నికలు వస్తే అసలు రైతు గురించి ఎవరూ పట్టించుకోకపోయేది. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ ఎప్పుడు ఉంటదో.. ఎప్పుడు పోతదో తెల్వని పరిస్థితి. మళ్లీ ఇప్పుడు 3 గంటల కరెంట్ ఇస్తమంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. అది ఎట్ల సాధ్యం. కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ పాతరోజులు వస్తయి. ఇప్పుడున్న ప్రభుత్వంలో అందరూ ఆనందంగా ఉన్నారు. ఈ సమయంలో కాంగ్రెసోళ్లు రైతులను నట్టేట ముంచాలని ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెసోళ్లు చెబుతున్న మూడు గంటల కరెంటుతో కనీసం మడి కూడా తడవదు. అసలు వ్యవసాయం మీద సోయుండే మాట్లాడుతున్నరా? కేసీఆర్ ఉండగా రైతుకు రోజూ పండుగే.

**- జాటోత్ భద్రు, రైతు, జాటోత్ తండా**

### మూడు గంటల కరెంట్‌తో ఒక మూల కూడా తడవదు



డోర్నకల్ : కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ అంటున్నడు. ఆ కరెంట్‌తో పొలంలో ఒక మడి కూడా తడవదు. అట్లాంటప్పుడు పంటలు ఎట్ల పండుతయి? 10హెచ్‌పీ మోటరు రైతులకు మోయలేని భారం. 10హెచ్‌పీ మోటరు కొనుగోలు చేయాలంటే ఒక లక్ష వరకు ఖర్చు అయితది. రేవంత్‌రెడ్డి తాతా మెటరు కొనిత్తడా?. ఎవుసం గురించి తెలియని వాడు విచిత్రంగా ఎవుసం గురించి మాట్లాడుతున్నాడు. కాంగ్రెస్ పాలనలో రాత్రిళ్లు టార్చ్ లైట్లు పట్టుకొని బాయిల కాడికి పోయి నీళ్లు పారించినం. అప్పుడు ఎరువులు, విత్తనాల కోసం అరిగోస పడ్డం. సీఎం కేసీఆర్ రైతులను రాజుగా మార్చారు. వ్యవసాయాన్ని పండుగలా చేశారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ చేసే బీఆర్ఎస్ ప్రభుత్వమే మాకు మళ్లీ సీఎం కేసీఆర్ వస్తడు. ఆయనకే మా మద్దతు.

**- కాడెం ప్రశాంత్, రైతు, చిల్కోడు**

### సాగు విస్తీర్ణం తగ్గుతది

నర్సింహులపేట : కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు నమ్మితే ఆగం కావాల్సిందే. ఇప్పటికే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ వద్దని, 3గంటలే చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్పిన రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి అధికారం కట్టబెడితే రాష్ట్రం అథోగతి పాలు కావడం ఖాయం. సాగునీరు, కరెంట్ కష్టాలు మళ్లీ మొదలైతయి. పంటలతో పాటు సాగు విస్తీర్ణం తగ్గిపోయే ప్రమాదం ఉన్నది. తెలంగాణ వచ్చినంక పదేండ్లలో కష్టపడి సాధించిన ఆర్థిక వ్యవస్థ తగ్గిపోయే ప్రమాదం ఉన్నది. గ్రామాల్లో 70 శాతం సాగునే నమ్ముకొని బతుకుతున్నం. భూముల ధరలు పడిపోతాయి. వ్యవసాయానికి నిరంతర కరెంట్ అవసరం లేదని ప్రకటించే నాయకులకు బుద్ధిచెప్పాలి. ధరణి ఎత్తివేసే కుట్ర జరుగుతున్నది. 3గంటల కరెంట్ ఏ మూలకూ సరిపోదు. 24గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ సార్‌కే అండగా ఉంటం.



**- అల్వాల ఉప్పలయ్య, రైతు, పడమటిగూడెం**

### రైతుల జీవితాలను మార్చిన ధరణి



చిన్నగూడూరు: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ధరణి పోర్టల్ రైతుల జీవితాల్లో ఎన్నో మార్పులు తెచ్చింది. ధరణి వద్దంటున్న కాంగ్రెసోళ్లు దాని వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించాలి. సాగులో ఒకరు, పట్టా మరొకరి చేతిలో ఉండి ఏండ్ల తరబడి అవస్థలు పడ్డ రోజులు ఉన్నాయి. శాశ్వత పరిష్కారం చూపేందుకే సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. దీంతో గంటల వ్యవధిలో రిజిస్ట్రేషన్ చేసి రైతుల ఇబ్బందులను తొలగిస్తున్నది. ఒకసారి రిజిస్ట్రేషన్ అయితే యాజమాని వేలిముద్ర లేనిదే అధికారులు రైతులకు భూమిపై ఉన్న హక్కులను మార్చలేరు. ఇంత పకడ్బందీగా అమలు చేస్తున్న ధరణిపై కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేయడం తగదు. సబ్బండ వర్గాలకు పనికి వచ్చే ఇలాంటి పథకాలు అమలుచేస్తున్న కేసీఆర్‌ను ఎన్నటికీ మరిచిపోలేం. మా మద్దతు కేసీఆర్‌కే. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తది.

**- జినక వీరప్పయ్య, రైతు, చిన్నగూడూరు**



### ధరణిని తీసేస్తే దళారులు పుట్టుకొస్తరు



ఇనుగుర్తి: సీఎం కేసీఆర్ రైతుల కోసం ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు భద్రత కల్పిస్తున్నరు. ధరణితో నేడు భూ సమస్యలన్నీ పరిష్కారమైనయ్. కాంగ్రెస్ వస్తే ధరణిని తీసేస్తామంటున్నరు. ధరణిని తీసేస్తే రైతులు ఆగం కావడం ఖాయం. కాంగ్రెస్ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థలో దొంగ రిజిస్ట్రేషన్లు చేసిండ్రు. రెవెన్యూ రికార్డులు గోల్‌మాల్ చేసి రికార్డులను మాయం చేసి సామాన్య రైతులను ఆగం చేసిండ్రు. ప్రస్తుతం ధరణితో పట్టా పాసుపుస్తకం, అరచేతితో భూమి వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నం. కేసీఆర్ సారు చేసిన గొప్పగొప్ప పనులు గతంలో ఏ నాయకుడూ చేయలె. అనాలోచితంగా కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయం. రైతులు ఆలోచించి మేలు చేసిన కేసీఆర్‌కే అండగా ఉండాలె. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలె.

**- ఇస్లావత్ వెంకన్న, రైతు, వీరారెడ్డిపల్లి**

### కాంగ్రెసును నమ్మితే కరెంటు కష్టాలు తప్పవు

ఇనుగుర్తి: కరెంటు కష్టాలతో 46ఏండ్లు బాధలు పడ్డం. సాగు చేసుకోవడానికి భూములున్నా కరెంటు, సాగునీరు లేక బీడుగా ఉండేవి. సీఎం కేసీఆర్ వచ్చినంక 24గంటల కరెంటుతో రెండు పంటలు పండించుకుంటున్నాం. ఇప్పుడు కాంగ్రెసొళ్లు ఎవుసానికి 3గంటల కరెంటు సాలు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొంటే సరిపోతుందని రేవంత్‌రెడ్డి చెబుతున్నరు. 10హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులందరం ఆర్థికంగా ఇబ్బందులు పడుతం. అసలు అవి వాడితే డీబుల మీద లోడు ఎక్కువై కాలిపోతయ్. ఇలాంటి వారికి అధికారమిస్తే రాష్ట్రాన్ని ఆగం చేస్తరు. వ్యవసాయం గురించి, రైతుల బాధల గురించి తెలిసిన సీఎం కేసీఆర్ సారుకే మా మద్దతు తెలుపుతాం. కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీతో పాటు 24గంటలు ఉచితంగా కరెంట్ ఇచ్చి రైతులకు అండగా నిలుస్తున్నరు.

**-గుగులోత్ శ్రీనివాస్ నాయక్, రైతు, రాముతండా**



### రైతులను ఆగం చేయాలని చూస్తుండ్రు..



బయ్యారం : సక్కంగున్న రైతు బతుకులను ఆగం చేయాలని కాంగ్రెసోళ్లు చూస్తుండ్రు. అప్పట్ల వాళ్లు అధికారంల ఉన్నప్పుడు ఎరువుల కోసం రైతులు సద్ది సంకన పెట్టుకొని లైన్లల్ల నిలవడి అరిగోసపడ్డరు. కళ్లు కాయలు కాసేలా కరంటు కోసం సూసిన రోజులు ఇంక గుర్తుకున్నయి. ఇంకా యాది మరువలేదు. చేనుకు నీళ్లు పెట్టేందుకు రైతు రాత్రి పోతే ఇంటికి వచ్చేదాక నమ్మకం ఉండకపోయేది. పాముకాట్లు, విద్యుత్ షాక్‌లతో అక్కడే బతుకులు తెల్లారిపోయేది. అప్పటి రోజులు కండ్ల ముందు కానొస్తున్నయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక సీఎం కేసీఆర్ రైతులను కడుపున పెట్టకొని సూసుకుంటాండు. సతికల పడ్డ రైతుల బతుకులు ఇప్పుడిప్పుడే తొవ్వన పడుతున్నయి. మళ్ల కాంగ్రెసోళ్లొచ్చి రైతులను ఆదుకుంటమని ఉద్దెర ముచ్చట్లు చెప్పుతుండ్రు. రైతులకు 24గంటల కరంటొద్దని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని, రైతులకు ఇచ్చే రైతుబంధు వేస్ట్ అని నోటికచ్చినట్టు మాట్లాడిన కాంగ్రెస్ నాయకులు ఏం మొఖం పెట్టుకొని వచ్చి ఓట్లు అడుగుతుండ్రు. రైతులు కాంగ్రెసోళ్లను నమ్మి ఇంకా మోసపోరు. రైతులకు అండగా ఉన్న బీఆర్ఎస్ సర్కారుకే జై కొడ్తరు. మళ్ల గెలిపించుకుంటరు.

**- బానోత్ రంగీలాల్, రైతు, ఉప్పలపాడు, బయ్యారం**